మారుత రాగంలో  పాడుతుంటే ఉదయ భాను, బంగారు కిరణాలు, తలలూచే చెట్లు... అన్నీ ఆమె నాధఝురితో నిండినట్లు అనిపించేది.

మధుమూర్తికో చిన్న కుటీరం వంటి ఇల్లు యిచ్చారు. సౌందర్య మంతా ఆ పరిసరాల్లోనే వుంది. కాలేజీకి వెళ్లివచ్చిన తరువాత సాయంకాలం ఒక గంట సేపు మళ్లీ రాత్రి మూర్తి ఆజ్ఞ ప్రకారం మరి కొంత సేపు సంగీత సాధన జరిగేది.

ఒక్కొక్క రాత్రి మధు మూర్తికి ఏమీ తోచేది కాదు. ఈ సుందరి – దివ్య సుందరి తనకి ఎంత పేరు ప్రతిష్ఠలు తీసుకు వస్తుందో? తను నేర్పిన విద్య తన గొంతులోని ఝురులు ఆమె మూలాన ఖ్యాతి నార్జించుకుంటాయి. తండ్రి ప్రయోజకుడైన తన పుత్రుణ్ణి చూసి ఉప్పొంగుతాడు. గురువు తన విద్య విఖ్యాతి నొందటం చూసి ఉప్పొంగుతాడు. అదే సాపత్యం గురువుకీ, పితరునికి, మధుమూర్తి ఇల్లా అనుకునేవాడు. ఈ చిన్న వయసులో వున్న నాలో యీ భావం కలిగిస్తోంది యీమె. ఏ పూర్వ జన్మ బాంధవ్యమో అని.

సుందరి అప్పుడే పాట నాపి తంబూర మీద ముఖమల్ గలీబు తొడిగింది. "పుస్తకాలు తెచ్చుకుంటాను." అని ఆమె వెళ్లబోతుంటే ఆపాడు మధుమూర్తి.

"చూడు సుందరీ, నాకు ఆ భావగీతం వినిపించావు కాదు" అన్నాడు. ఆమె సిగ్గు పడింది. అతనికి భావగీతాలు ఎక్కువగా నచ్చవని తెలుసు. కానీ తనని మెప్పించడానికి అల్లా అడుగుతాడు. "రాత్రి పాడుతాను" అన్నది. అంటూనే కూర్చుంది తివాసీ మీద.

"మీ కాలేజీ విశేషాలు చెప్పవూ నాకు?" అన్నాడు మధు మూర్తి. సుందరితో ఖబుర్లాడి కొన్ని రోజులయింది. "ఏమున్నాయి మాష్టారూ, మా కాలేజీ వార్షికోత్సవం వచ్చేవారం. నేను 'రాగమాలిక'లో ప్రార్ధన శ్లోకం పాడనా మాస్టారుగారూ?" అన్నది ఆమె ఆశగా.

"అలాగే. మీ కాలేజీలో అంతా ఏమనుకుంటున్నారు వార్షికోత్సవాన్ని గురించి? నిన్ను పాడమని అడిగారా?"

"అడిగారు. పైగా అన్నారూ... " నాలిక్కరుచుకుంది.

"ఏమన్నారు?"

సుందరి అయిష్టంగా చూసింది. "ఏమీ లేదు" ఆమె ముఖం ఎర్రబడింది. మళ్లీ అన్నది "ఏమీ లేదు" అని.

మధు మూర్తి నవ్వాడు. "పోనీలే వెళ్లు పుస్తకాలు తీసుకురా" అన్నాడు.

తలవంచుకుని కూర్చుంది సుందరి. కదల్లేదు.

"పాఠం వద్దా సుందరీ?" అన్నాడతను. ఆమె ఉలిక్కి పడి లేచింది. తత్తరపాటుతో వెళ్ళింది.

ఎందుకు ఆమె కళ్లు చలిస్తున్నాయి? నేనేమన్నాను. అనుకున్నాడు మధు మూర్తి. ఆమె వచ్చింది పుస్తకాలతో. తలఎత్తకుండానే కూర్చుని పాఠం చదివింది. 'స్వర కల్పన' గురించి ప్రత్యేక విషయాలు చెబుతున్నాడు అతను. కానీ ఎందుకు ఆమె చేతులు వణుకుతున్నాయి?

"ఏమైంది సుందరీ? ఎందుకల్లా వున్నావు?" అన్నాడు పుస్తకం చూసి.

"ఏం లేదు"

మధుమూర్తి మాటలకి తావు లేదు. సుందరి అప్పటికే చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తోంది. మధు మూర్తికి అర్థం కాలేదు.

